




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ : నరేంద్ర

గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 94 | పేజీలు : 4 | సోమవారం 6 ఏప్రిల్ 2026 | వెల : 4/-


## మాచర్లలో నవ వధువు హత్య కేసు...
## సీఐ నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు



- పరువు హత్య కేసులో పోలీసుల నిర్లక్ష్యం బహిర్గతం
- సీఐ వెంకటరమణ సహా ముగ్గురు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు



## చెరుకూరులో పనికిరాని రోడ్లు....
# లక్షల నిధులు వృథా

వేసిన రోడ్లు ప్రజలకు ఉపయోగం లేవని గ్రామస్తుల ఆగ్రహం

15 రోజులుగా రక్షణ దినపత్రికలో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు

కలెక్టర్ బలహీన వర్గాల వైపు చూడరా?

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు పంచాయతీలో లక్షల రూపాయల నిధులతో రోడ్లు నిర్మించామని అధికారులు చెబుతున్నా, అవి గ్రామ ప్రజలకు పెద్దగా ఉపయోగపడని నిర్మాణాలుగా మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ రికార్డుల్లో సిమెంట్, కంకర రోడ్లు వేసినట్లు లెక్కలు చూపుతున్నప్పటికీ అవి ప్రజలకు అవసరమైన మార్గాల్లో కాకుండా పనికిరాని ప్రదేశాల్లో నిర్మించబడ్డాయని చెబుతున్నారు. గత 15 రోజులుగా రక్షణ దినపత్రిక గ్రౌండ్ లెవెల్ రిపోర్టుల ద్వారా ఈ విషయాలను వెలుగులోకి తీసుకువస్తున్నా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించకపోవడం ప్రజల్లో తీవ్ర అసహనానికి దారి తీసింది.





### ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుంది

- బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం
- బీజేపీ మహావిజయంతో ప్రజల్లో భరోసా పెరుగుతుంది
- ఎన్నికల తర్వాత టీఎంసీ పాపాల లెక్కతేల్చి శిక్షిస్తాం: ప్రధాని మోదీ



### రళలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది

- కేరళ యువతకు సరైన ఉద్యోగాలు లేవు
- ఫలితంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు
- ఇకపై అలాంటి అవసరం రాకుండా కేరళను అభివృద్ధి చేస్తాం
- కున్నతునాడు నియోజకవర్గంలో అమిత్ షా వ్యాఖ్యలు

## నీటిసంరక్షణ, జలవనరుల పరిరక్షణపై
# వందరోజుల కార్యాచరణ

- సాగునీటి సంఘాల సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం
- నీటిసంరక్షణ, జలవనరుల పరిరక్షణకు 100 రోజుల కార్యాచరణ ప్రకటించిన చంద్రబాబు
- సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా కార్యాచరణ అమలు చేసేలా ప్రణాళికలు
- ఏప్రిల్ 21 నుంచి జూలై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలి
- జూలై 10 నుంచి 14 జూలై పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలి



**అమరావతి**

రాష్ట్రంలో నీటి భద్రత సాధిస్తే ఇతర రంగాల్లో అభివృద్ధి సుసాధ్యం అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కరవు రహిత ఆంధ్రప్రదేశ్ చేయటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వేసవి కంటే ముందు 6 మీటర్లు, వర్షపు సీజన్ పూర్తి అయ్యే నాటికి 3 మీటర్ల లోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉండాలని ఆయన నిర్దేశించారు. రేపటి నుంచి వంద రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే నీటి సంరక్షణ-జలవనరుల పరిరక్షణ కార్యాచరణను సీఎం ప్రకటించారు. నేటి నుంచి (ఈ నెల 6వ తేదీ) రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంపై సాగునీటి సంఘాలు, మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయితీరాజ్, అటవీ, పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా ఈ జల సంరక్షణ కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా యాక్షన్ ప్లాన్ అమలు చేసేలా - మిగతా3లో



## బాబూ జగజ్జీవన్ రామ్.. ఆహార సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించిన మహా వ్యక్తి

ఆయన స్ఫూర్తితోనే ప్రభుత్వం నడుస్తోంది

మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు వెల్లడి

**అమరావతి**

ఆహార సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించిన మహోన్నత వ్యక్తి బాబూ జగజ్జీవన్ రామ్ అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం చంద్రబాబు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, నేతలు, కంచర్ల శ్రీకాంత్, - మిగతా3లో


### ‘ప్రతీకారం తీర్చుకోవడానికి ఓటు వేయండి’



- ప్రజలకు మమతా బెనర్జీ పిలుపు
- ఎస్ఐఆర్‌లో పేర్లు తొలగించడంపై మమతా ఆగ్రహం
- ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపు

# ప్రైవేటుకు ‘నై’, సర్కారుకు ‘సై’

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న బాలికల సంఖ్య
- ‘ప్రైవేటు’ కంటే సర్కారు విద్యా సంస్థల్లోనే ఎక్కువ మంది విద్యార్థినులు
- కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పాఠశాలలో 3 వేల మందికి పైగా అమ్మాయిలు
- ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రభుత్వ చదువులకే ప్రాధాన్యం



**అమరావతి**

ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను పరిశీలించినా, విద్యార్థినుల సంఖ్య అధికంగానే కనిపిస్తోంది. ఓ వైపు విద్య పై సమాజంలో అవగాహన పెరుగుతోంది. మరోవైపు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల బాలికా విద్యకు ఇచ్చే ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోంది. మన విద్యా వ్యవస్థలో మరో ఆసక్తికరమైన అంశం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు కంటే బాలికల సంఖ్య గణనీయంగా ఉంది. ఫలితంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో బాలికల కంటే - మిగతా3లో

## ఫుడ్ అండ్ సేఫ్టీ బృందాల
# విస్తృత తనిఖీలు



- పాలలో యూరియా, డిటర్జెంట్ కలుపుతున్నట్లు గుర్తింపు!
- రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాటు ముమ్మర తనిఖీలు
- పాలలో యూరియా, డిటర్జెంట్లు, రసాయనాల గుర్తింపు

**అమరావతి**

రాజమహేంద్రవరం కల్తీ పాల మృతుల ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. కల్తీ పాలు తాగి ఏకంగా 17 మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరో ఇద్దరు పసిపిల్లలు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో విలవిల్లాడుతున్నారు. ఈ విషాదం తర్వాత ప్రభుత్వ యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. అప్రమత్తమైన ‘ఆహార భద్రత-ప్రమాణాల శాఖ’ కల్తీ రాయుళ్లపై కొరడా ఝుళిపించింది. గత 15 రోజులుగా అన్ని జిల్లాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టింది. ఈ దాడుల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మనం తాగుతున్న పాలలో నీళ్లకు బదులు ఏకంగా ప్రాణాంతక రసాయనాలు - మిగతా3లో

### కాంగ్రెస్‌కు ‘బబ్బర్ షేర్’ ప్రచారం

- మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు: రాహుల్ గాంధీ
- అసోంను ఏకం చేయటానికి సంగీతకారుడు జుబీన్ గార్గ్ తన జీవితమంతా కృషి చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్య



# కేరళ ఎన్నికలపై యుద్ధ ప్రభావం

ఏప్రిల్ 9న ఒకే విడతలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికలపై పశ్చిమాసియా యుద్ధం తీవ్ర ప్రభావం చూపుతోంది. కేరళ ఆర్థిక వ్యవస్థకు 'గల్ఫ్ దేశాలే' ప్రాణాధారం. కానీ ఇప్పుడు అక్కడ నెలకొన్న యుద్ధ వాతావరణం కేవలం ఆర్థిక వ్యవస్థనే కాదు, కేరళ ఎన్నికల ఫలితాలను సైతం శాసించేలా కనిపిస్తోంది. ఓట్లు వేసేందుకు స్వదేశానికి వచ్చే ప్రవాస భారతీయుల సంఖ్య భారీగా పడిపోతుండటంతో నువ్వా నేనా అన్నట్లు అనేక నియోజకవర్గాల్లో పోటీ నెలకొంది. కాగా, ఈ ఎన్నికల్లో ఎలాగైనా సరే అధికారం నిలబెట్టుకోవడానికి ఎల్‌డీఎఫ్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అలాగే కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సైతం గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తోంది. మరోవైపు, బీజేపీ కూడా ఈ సారి ఎన్నికల్లో విజయం సాధించాలని శాయశక్తులా పోరాడుతోంది.? మరి ఈ పరిస్థితుల్లో గల్ఫ్ యుద్ధం కేరళ ఎన్నికల ముఖచిత్రాన్ని ఎలా మార్చేస్తుందో ఈ కథనంలో చూద్దాం.




**గల్ఫ్ దేశాల నుంచి దాదాపు 50 వేల మంది!**

సాధారణంగా కేరళ ఎన్నికలు వస్తున్నాయంటే చాలు గల్ఫ్ దేశాల నుంచి దాదాపు 50 వేల మందికి పైగా ప్రవాస భారతీయులు ప్రత్యేక విమానాల్లో వచ్చి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. కానీ ఈ ఎన్నికల్లో ఆ సంఖ్య అనూహ్యంగా 5,000 కంటే దిగువకు పడిపోతుందని అంచనా. యుద్ధం కారణంగా ఆకాశాన్నంటిన విమాన ఛార్జీలు, గగనతల ఆంక్షలతో విమాన సర్వీసుల రద్దు, గల్ఫ్ దేశాల్లో తలెత్తిన సెలవుల సంక్షోభం దీనికి ప్రధాన కారణాలు. యుద్ధ భయంతో దుబాయ్, దోహా తదితర ప్రాంతాల్లోని కంపెనీలు తమ ఉద్యోగుల సెలవులను కేవలం 10–12 రోజులకు కుదించాయి. దీంతో ఒక్క ఓటు కోసం వేలకు వేలు ఖర్చుపెట్టుకుని కేరళ రావడం ప్రవాసులకు ఆర్థికంగా పెను భారంగా మారింది. ఏకంగా 2.4 లక్షల మంది ఓవర్సీస్ ఓటర్లు నమోదు చేసుకున్నప్పటికీ ఈసారి పోలింగ్ బూత్‌లకు వచ్చేవారి సంఖ్య రికార్డు స్థాయిలో పడిపోనుంది. కేరళ రాజకీయాల్లో కేవలం వందల ఓట్ల తేడాతోనే అభ్యర్థుల తలరాతలు మారుతుంటాయి. ప్రవాస ఓటర్ల రాక తగ్గడం స్వింగ్ సీట్లలో భారీ ప్రభావం చూపనుంది. ముఖ్యంగా వడకర, నాదాపురం, పొన్నాని, చావక్కాడ్ లాంటి నియోజకవర్గాల్లో ప్రవాస ఓటర్ల ప్రభావం అత్యధికం. గతంలో ముస్లిం లీగ్ , యూడీఎఫ్? అనుబంధ సంస్థలు ఫ్లైట్స్ బుక్ చేసి మరీ ఓటర్లను రప్పించేవి. కానీ ఇప్పుడు ఈ ఓటర్లు గల్ఫ్‌కే పరిమితం కావడం యూడీఎఫ్?నకు గట్టి ఎదురుదెబ్బగా మారే అవకాశముంది. ఇదే అదనుగా ఆయా స్థానాల్లో పట్టు సాధించాలని ఎల్‌డీఎఫ్, ఎన్‌డీఏ కూటములు వ్యూహాలు రచిస్తున్నాయి.

ఓటింగ్‌తో పాటు, గల్ఫ్ ఆర్థిక సంక్షోభం ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా మారింది. గల్ఫ్‌లో పనిచేస్తున్న కేరళ వాసులు ఏటా 2.16 లక్షల కోట్ల రూపాయలను తమ స్వరాష్ట్రానికి పంపిస్తుంటారు. కానీ యుద్ధం కారణంగా ఈ ఏడాది అందులో 20 శాతం కోత పడనుందని అంచనా. కొంత మంది ఉద్యోగాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.

**గల్ఫ్ దేశాల నుంచి వచ్చే ప్రవాసులకు తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే**

రక్షణ కవచం అని అధికార ఎల్?డీఎఫ్? ప్రచారం చేస్తోంది. స్థానికంగా ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, గల్ఫ్ పై అతిగా ఆధారపడటం వల్లే ఈ దుస్థితి వచ్చిందని విపక్ష యూడీఎఫ్? విమర్శిస్తోంది. గల్ఫ్?లో ఉన్న భారతీయులను రక్షించే సత్తా కేంద్ర ప్రభుత్వానికే ఉందని ఎన్‌డీఏ ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ప్రవాసులు రాలేని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో కేరళ రాజకీయాల్లో సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే "వాట్సాప్ ఓటు". గల్ఫ్‌లో ఉండే ఒక్కో వ్యక్తి తన కుటుంబంలో కనీసం 4 నుంచి 8 ఓట్లను ప్రభావితం చేయగలడని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో పార్టీలు ఇప్పుడు విమాన టికెట్లకు బదులు డిజిటల్ ప్రచారంపై దృష్టి పెట్టాయి. దుబాయ్ నుంచి చేసే ఒక్క వీడియో కాల్, స్థానికంగా జరిగే పది సభల కంటే ఎక్కువ ప్రభావం చూపుతుందని పార్టీలు నమ్ముతున్నాయి. ఓటర్లు భౌతికంగా గల్ఫ్ లోనే ఆగిపోయినా వారి నిర్ణయాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ల ద్వారా కేరళ రాజకీయాలను శాసిస్తున్నాయి. "మిడిల్ ఈస్ట్" ఎఫెక్ట్‌ను దాటుకుని ఏప్రిల్ 9న ఏ పార్టీ విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

# రళలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది

కేరళలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం ఊపందుకుంది. ఈ అసెంబ్లీ ఎన్నికలు కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును మెరుగుపరచడానికేనని కేంద్ర హోంమంత్రి అమిత్? షా వ్యాఖ్యానించారు. 2014 లోక్?సభ ఎన్నికల తర్వాత కేరళలో ఎన్?డీఏ ఓట్లు పెరిగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇది అనువైన సమయమని పేర్కొన్నారు. అయితే, కేరళలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు తమకు మద్దతు అవసరమని షా నొక్కి చెప్పారు. ఎర్నాకుళం జిల్లా కున్నతునాడు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న షా, ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ఈ ఎన్నికలు కేవలం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని తొలగించి ఎన్?డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం కోసమే కాదు. ఇవి కేరళ భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎన్నికలు. భారతదేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన మొట్టమొదటి రాష్ట్రం కేరళే. ఇక్కడి యువత ఎంతో ప్రతిభావంతులు, తెలివైనవారు, కానీ వారికి సరైన ఉద్యోగాలు లేవు. ఫలితంగా వారు ఉద్యోగాల కోసం ఇతర గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. అయితే, ఇకపై అలాంటి అవసరం లేకుండా ఇక్కడే వారికి ఉద్యోగాలు లభించేలా ఒక గొప్ప కేరళను నిర్మించాలని మేము ఆశిస్తున్నాం. ప్రపంచం నలుమూలలా కమ్యూనిస్టు పార్టీ కనుమరుగైపోతోంది. అలాగే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కూడా అంతరించిపోతోంది. నేడు, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో యావత్తు దేశం ముందుకు సాగుతోంది.



2014 లోక్‌సభ ఎన్నికల్లో, కేరళ నుంచి వచ్చిన ఓట్లలో 14 శాతం ఎన్?డీఏ కూటమికి దక్కాయి. కాబట్టి ఎన్?డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది."

**ఆ మార్క్సిస్ట్ నాయకుడు పేర్లు మార్చే స్టార్టప్‌ను ప్రారంభించారు!**

మరోవైపు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ మార్క్సిస్ట్ నాయకుడు పేర్లు మార్చే స్టార్టప్‌ను ప్రారంభించారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేంద్ర నిధులతో చేపట్టిన అన్ని ప్రాజెక్టుల పేర్లు మార్చి, వాటి ఘనతను తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. "ప్రధాని మోదీ ప్రతి పేద వ్యక్తికీ 5 కిలోల బియ్యాన్ని అందిస్తున్నారు. అలాగే, జాతీయ రహదారి 66 నిర్మాణానికి అయ్యే ఖర్చులో 100 శాతాన్ని మోదీనే భరిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి విజయన్ భారీ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా, జాతీయ ఆరోగ్య మిషన్ కోసం ప్రధానమంత్రి మోదీ రూ. 600 కోట్లు పంపిస్తున్నారు, కానీ అక్కడ ఫొటోలు పెట్టుకోవడానికి స్థలం లేదన్న సాకుతో దాన్ని మూసివేశారు. నిన్న రాహుల్ గాంధీ వచ్చి పెట్రోల్ ధరలు పెరిగాయని అన్నారు. కానీ అది కేరళలో కాదు, పాకిస్తాన్‌లో" అని షా వ్యాఖ్యానించారు.

**'భారత్ మాతను అత్యున్నత పీఠంపై నిలపడానికే మేం రాజకీయాల్లో ఉన్నాం'**

మరోవైపు, తిరువనంతపురం బహిరంగ సభలోనూ అమిత్ షా మాట్లాడారు. ఈ సారి కేరళలో తమ ప్రభుత్వాన్నే ఏర్పాటు చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ఎవరు కూడా ప్రజలకు మంచి చేయలేదని, వారంతా అవినీతికి పాల్పడ్డారని షా ఆరోపించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, శబరిమల ఆలయ బంగారు కేసులో నిందితులను జైలులో పెడతామని హామీ ఇచ్చారు. భారత్ మాతను అత్యున్నత పీఠంపై నిలపడానికే తాము రాజకీయాల్లో ఉన్నామని షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 140 అసెంబ్లీ స్థానాలకు గానూ కేరళలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 23తో ముగియనుంది. కాగా, కేరళలో అధికారంలో ఉన్న సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) చూస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో దాదాపు దశాబ్ద కాలంగా ఎల్‌డీఎఫ్ అధికారంలో ఉంది.

# 'ప్రతీకారం తీర్చుకోవడానికి ఓటు వేయండి'

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అనేక మంది పేర్లు తొలగించారని ఆరోపించారు. అయితే, ప్రజల పేర్లను తొలగించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి, అలాగే ఎస్ఐఅర్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాల్లోనే మీ ప్రతిస్పందన కనిపించాలన్నారు. అలాగే ఎస్ఐఆర్‌లో పేర్లు గల్లంతైన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా సూచించారు. ముర్షిద్షబాద్‌లోని సంషేర్‌గంజ్ జరిగిన ఎన్నికల సభలో మమతా బెనర్జీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా తొలగింపునకు కేంద్ర ప్రభుత్వాన్ని పరోక్షంగా బాధ్యులుగా చూపిస్తూ మమత విమర్శించారు. ధైర్యం ఉంటే నేరుగా పోటీ చేయాలని వ్యాఖ్యానించారు. అలాగే, కొందరు బూత్ ఏజెంట్లు ప్రలోభాలకు లోనుకాకుండా పార్టీ ప్రయోజనాలను కాపాడాలని కోరారు. కొన్నిచోట్ల ఈవీఎం యంత్రాల పనితీరుపై కూడా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో యంత్రాలు పనిచేయకుండా చేసే ప్రయత్నాలు జరుగుతాయని ఆరోపించారు. అలాంటి సందర్భాల్లో మరమ్మతులు చేయకుండా కొత్త యంత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కార్యకర్తలను ఆదేశించారు.

**'వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచా'**

ముస్లింల ప్రయోజనాల కోసం తాను పోరాడుతున్నానని, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచినట్లు మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కానీ ఈ విషయంలో బీజేపీ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. అయితే, వక్ఫ్ చట్ట అమలుతో ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలను ప్రస్తావించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రాణనష్టాలు జరిగినట్లు గుర్తుచేశారు. అయితే, ఆ హింసాత్మక ఆందోళనలకు టీఎంసీ ప్రేరేపిస్తోందని బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణలను సైతం మమతా ఖండించారు.



**టీఎంసీ పాలనలో ఉద్యోగ అవకాశాలు పెరిగాయి!**

ఇదిలా ఉండగా, టీఎంసీ పాలనలో మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువతకు విద్యా అవకాశాలు పెరిగాయని మమతా పేర్కొన్నారు. వారు ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. అయితే, సమాజం పురోగమిస్తోందని, కానీ ప్రత్యర్థి పార్టీలు దాన్ని సహించలేకపోతున్నాయని మమతా తెలిపారు. టీఎంసీ వరుసగా నాలుగోసారి పదివిలోకి వస్తే, మహిళల కోసం అమలు చేస్తున్న లక్ష్మీర్ భండార్ పథకాన్ని కొనసాగిస్తామని, జీవితకాల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన బంగ్లార్ యువ సాథి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున సహాయం అందిస్తామని తెలిపారు.

**అలాగైతే ముందు వాళ్లే రాజీనామా చేయాలి!**


అసెంబ్లీ ఎన్నికల కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయా యని మమత పేర్కొన్నారు. ఎన్నికల సంఘం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేసిందని, ఎన్నికల తర్వాత పనులు మళ్లీ ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే, ఎన్నికల సంఘం చర్యలపై కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పేరుతో కొంత మంది ఓటర్లను బెదిరిస్తున్నారని, మరికొందరిని తొలగిస్తున్నారని ఆరోపిం చారు. ఓటర్ల జాబితాలో చొరబాటుదారుల పేర్లు ఉంటే, గతంలో ప్రధానమంత్రి, హోంమంత్రి కూడా వారి ఓట్లతోనే గెలిచారని మమతా అన్నారు. కాబట్టి వారే ముందుగా రాజీనామా చేయాలని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన జాబితానే ఈసారి ఎందుకు ఉపయోగించలేదని మమతా ప్రశ్నించారు.

**బంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరం**

కాగా, బంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏప్రిల్ 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతు ముందుకు సాగుతున్నాయి.

## ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుంది

బంగాల్‌లో ఈసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుందన్నారు. కూచ్ బెహార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, టీఎంసీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఇతర ప్రాంతాల వారికి ఉపాధి కల్పించిన బంగాల్‌ను టీఎంసీ సర్కార్ వలసలకు కేంద్రంగా మార్చిందని దుయ్యబట్టారు. బంగాల్‌లో శాంతిభద్రతలకు అంతిమ యాత్ర నిర్వహించేందుకు టీఎంసీ కంకణం కట్టుకుందని ప్రధాని విమర్శించారు. ఈ ఎన్నికలు అధికార పక్షం వ్యాపింపజేస్తున్న భయం, బీజేపీ కల్పిస్తున్న భరోసా మధ్య పోరుగా ప్రధాని మోదీ అభివర్ణించారు. టీఎంసీ బుజ్జగింపు రాజకీయాల కారణంగా గ్రేట్ బంగాల్ తన గుర్తింపు కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాటుదారులను రక్షించేందుకు వా.×.=., జ.ూా.ూా.ను టీఎంసీ అడ్డుకుంటోందని ఆరోపించారు. బంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో జనాభా మార్పు ప్రమాదకరంగా ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఎన్నికల తర్వాత టీఎంసీ పాపాల లెక్క తేల్చటమే కాకుండా బాధ్యులైన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సంఘంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నికలు భయం లేకుండా స్వేచ్ఛగా, న్యాయంగా జరుగుతాయని ప్రధాని మోదీ తెలిపారు.



"పోలింగ్ రోజు టీఎంసీ గూండాలు మిమ్మల్ని(ప్రజలను) ఎంత బెదిరించినా కూడా చట్టంపై నమ్మకం ఉంచాలి. ఈ ఎన్నికల్లో బంగాల్ నుంచి భయం పారిపోతుంది. బీజేపీ మహావిజయంతో భరోసా పెరుగుతుంది. నేను మీకు హామీ ఇస్తున్నాను. ఈసారి ఎన్నికల తర్వాత వారి (టీఎంసీ)పాపాల లెక్క పూర్తిగా తేలుస్తాం. వెతికి వెతికి మరీ లెక్కిస్తాం. మే 4వ తేదీ తర్వాత చట్టం తనపని తాను చేస్తుంది. ఎంత పెద్ద గూండా అయినా సరే ఈసారి శిక్ష తప్పదు. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ పట్ల భయం ఉంటే, మరోవైపు బీజేపీ పట్ల మీకు నమ్మకం ఉంది. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ వారి కమీషన్ల దందా, అవినీతి పట్ల భయం ఉంటే, మరోవైపు అభివృద్ధిని వేగవంతం చేయగల బీజేపీ పట్ల నమ్మకం ఉంది. ఒకవైపు చొరబాటుదారుల బెడద పట్ల భయం ఉంటే, మరోవైపు రాష్ట్రం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టగల బీజేపీ పట్ల నమ్మకం ఉంది." ఈ క్రమంలోనే 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి 'మహిళా రిజర్వేషన్ల చట్టం'ను అమలు చేసేందుకు అవసరమైన బిల్లులను ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తుందని గుర్తు చేశారు. "ఇప్పటివరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన సోదరీమణులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించింది. మేము 3 కోట్ల మంది సోదరీమణులను 'లఖ్‌పతి దీదీ' లుగా మార్చాము. ఈ క్రమంలోనే దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో మహిళల పాత్ర మరింత పెరగడం అత్యంత అవసరం. అందుకే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించేలా మా ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే బంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న సోదరీమణులందరూ ఈ రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేలా చేయడానికి ప్రస్తుతం కృషి చేస్తున్నాం. అందుకే ఏప్రిల్ 16– 18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాం. మన తల్లులు, సోదరీమణులకు దక్కాల్సిన ఈ హక్కు గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. దీనిపై ఇకపై ఎటువంటి జాప్యం చేయడం సముచితం కాదు. కూచ్ బెహార్ వేదికగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు నేను మరోసారి భరోసా ఇస్తున్నాను. జనాభా నియంత్రణలో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, సీట్ల కేటాయింపు విషయంలో ఎటువంటి నష్టాన్ని ఎదుర్కోవు. అందరూ లబ్ధి పొందుతారు. అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం, ప్రతి ఒక్కరి హక్కులు సురక్షితంగా ఉంటాయి. మహిళల కోసం అదనపు సీట్లను పెంచడం ద్వారా రాష్ట్రాలు భారీ ప్రయోజనాలను పొందేలా చూడాలనే విషయాన్ని పార్లమెంటులో బలంగా ముద్ర వేయాలని మేము కోరుకుంటున్నాం." అని ప్రధాని మోదీ అన్నారు.

## కాంగ్రెస్‌కు 'బబ్బర్ షేర్' ప్రచారం



లఅసోంను ఏకం చేయటానికి సంగీతకారుడు జుబీన్ గార్గ్ తన జీవితమంతా కృషి చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఆయన ఎప్పుడు కూడా ఎవరితో దురుసుగా ప్రవర్తించలేదన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతం కూడా ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచటమే అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున బిశ్వనాథ్ జిల్లాలో ప్రచారం చేసిన రాహుల్, బీజేపీ, అసోం సీఎం హిమంత బిశ్వశర్మపై విమర్శలు చేశారు. దేశంలో అత్యంత అవినీతిపరుడైన సీఎం హిమంత బిశ్వశర్మపై తమ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత చర్యలు తీసుకుంటుందని రాహుల్ హామీ ఇచ్చారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా, ఆయన్ను వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. "అసోంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గర్గ్ రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా కాంగ్రెస్? సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే వందరోజుల్లో జుబీన్ గార్గ్ కేసులో విచారణ జరిపి బాధ్యులకు శిక్షపడేలా చూస్తాం. 6 గిరిజన జాతులకు ఎస్టీ హోదా కల్పిస్తాం. తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 వేతనం ఇస్తాం. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసే మొదటిపని నెలవారీ నగదు బదిలీ కింద ప్రతి మహిళ ఖాతాలో డబ్బు జమ చేస్తాం. చిరు వ్యాపారం చేయాలనుకునే మహిళల ఖాతాలో 50వేలు జమచేస్తాం. కాంగ్రెస్ బబ్బర్ షేర్ ప్రచారం చేస్తున్నాడని మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు"

**హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం**

హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందని అన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. "మీ ముఖ్యమంత్రి 24 గంటలూ అర్థం లేని మాటలు మాట్లాడుతూనే ఉంటారు. కాంగ్రెస్? నాయకులు అసోంను విభజించడానికి ఎప్పుడూ చూడలేదు. వారు ఎప్పుడూ ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించలేదు. అయితే, మీ ముఖ్యమంత్రి మాత్రం నిరంతరం రాష్ట్రాన్ని విభజించి, ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. హిమంత బిశ్వ శర్మ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయన భారతదేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రి కాబట్టే ఇలా చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని 'సింహాలు' తనను జైలులో పెడతారని ఆయనకు తెలుసు."

అసోం ప్రజల ప్రయోజనాల కంటే, కొన్ని కార్పొరేట్ గ్రూపుల లాభం కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాతో సహా కేంద్ర నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. అసోం వనరులను పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నారని ఆయన ఆరోపించారు. "దిల్లీలో కూర్చున్న ఆయన వ్యాపార భాగస్వాములు నరేంద్ర మోదీ, అమిత్ షా మిమ్మల్ని వారి వ్యక్తిగత ఏటీఎంలా మార్చేశారు. మీ భూమిని అంబానీ, అదానీ, బాబా రామ్‌దేవ్‌లకు అప్పగించారు. ఆయన ఈ భూమిని ఉచితంగా ఇవ్వరు. బదులుగా ఈ వ్యక్తులు ఆయనకు తమ మద్దతును అందిస్తున్నారు. ట్రంప్ ట్వీట్ పంపినప్పుడల్లా మోదీ వణికిపోతుంటారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

# ప్రైవేటుకు 'నై', సర్కారుకు 'సై'

-మొదటిపేజీ తరువాయి

బాలురు సంఖ్య అధికంగా ఉంటుంది. ఇది మన సమాజంలో నెలకొని ఉన్న ఆర్థిక పరిస్థితులు, ఆలోచనలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రాథమిక స్థాయిలో బాలబాలికల మధ్య వ్యత్యాసం తక్కువగానే ఉన్నప్పటికీ ఉన్నత పాఠశాల స్థాయికి వెళ్లేసరికి ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు సంఖ్య, ప్రైవేటు బడుల్లో బాలుర సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఎయిడెడ్?లో కలిపి ఈ సంవత్సరం బాలికలు 17.34 లక్షల మంది చేరగా, కేవలం 15.47 లక్షల మంది బాలురు మాత్రమే చేరారు. దీనికి విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో బాలుర సంఖ్య 19.81 లక్షల మంది ఉండగా, 15.59 లక్షల మంది బాలికలు చదువుతున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ఆసక్తికరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో అత్యధికంగా విద్యార్థినులు చదువుతున్నారు. ఒక్క ఎమ్మిగనూరులోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో 3,323 మంది విద్యార్థులు ఉన్నారు. డోన్ బాలికల ఉన్నత పాఠశాలల్లో 1,137 ఉండగా, ఆదోని బాలికల ఉన్నత స్కూల్లో 1,724 మంది అమ్మాయిలు చదువుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా బాలికలు చదువుతున్న పాఠశాలగా ఎమ్మిగనూరు నిలిచింది. దీనికి సమీపంలోని బీసీ సంక్షేమ వసతి గృహం నుంచే సుమారు 500 మంది విద్యార్థినులు వస్తుండటం గమనార్హం. ప్రతి ఏడాది కొత్త ప్రవేశాలు 800 మందికి పైగా పొందుతున్నారు. ఏ తరగతి గదిని చూసినప్పటికీ విద్యార్థినులతో కిక్కిరిసి కనిపిస్తోంది. బాలికలకు ప్రత్యేకంగా ఉండడంతో తల్లిదండ్రులు ఇక్కడ ప్రవేశాలకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నారు. ఈ పాఠశాలలోను కూడా అనేక సమస్యలు విద్యార్థిలను వేధిస్తున్నాయి.



విద్యార్థులు ఎదుర్కొంటున్నా సమస్యలు:-

ఎమ్మిగనూరు బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉంది. దీంతో విద్యార్థినులు వరుసలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

50 సెక్షన్లకు గానూ ప్రతి సెక్షన్?కు ఒక తరగతి చొప్పున 50 గదులు అవసరం అవుతుంది. కానీ ఇక్కడ ప్రస్తుతం 35 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులోనూ 18 శిథిలావస్థ స్థితికి చేరాయి.

చాలా వరకు తరగతుల్లో గదుల కొరత ఉండడం చేత ఒక్కో క్లాస్?లో 70-80 మంది పిల్లల్ని కిక్కిరిసేలా కూర్చేబెడుతున్నారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 8 గదులను అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం వాటిని తరగతులకు వినియోగిస్తున్నారు.

15 తరగతులను చెట్ల కింద, వరండాలో నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక ల్యాబ్?లు, లైబ్రరీల కోసం మరిన్ని గదులు కావాల్సి ఉంది. దీంతో ప్రస్తుతం వీటిల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు.

భోజనశాల, వంటలు చేసేందుకు ప్రత్యేక గదుల కొరత ఉంది. దీంతో పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ బడులపైనే మక్కువ: ప్రభుత్వం ప్రత్యేకంగా బాలికల కోసం ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో వారికి హాస్టల్ సదుపాయం, అలాగే ప్రత్యేకంగా బాలికల కోసం సంక్షేమ వసతి గృహాలను కూడా ప్రవేశ పెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బాలికల విద్య పట్ల అవగాహన క్రమంగా పెరుగుతోంది. ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్లు, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తల్లిదండ్రులను ఎంతోగానో ఆకట్టుకుంటున్నాయి. అన్ని సదుపాయాలతో ఆవాసాలకు సమీపంలోనే ప్రభుత్వ బడులు ఉండడం కూడా ఇందుకు గల మరో కారణంగా చెప్పచ్చు.

**ఇప్పటికీ సురక్షితం కాదని కొందరూ భావిస్తున్నారు:**

ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంతమంది అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. బాలురును మాత్రం ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. అమ్మాయిలను వసతి గృహాల్లోనే ఉంచుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించడాన్ని ఇప్పటికీ సురక్షితం కాదని కొందరూ భావిస్తున్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో వారిని ఎంత చదివించినా పెళ్లి చేసి, పంపించాలి అనే దృక్పథం నేటికీ కొనసాగుతోంది. ప్రాథమిక స్థాయిలో ఫీజులు తక్కువగా ఉండటం వల్ల కొంతమంది బాలికలను ప్రైవేటు బడుల్లో జాయిన్ చేయిస్తున్నారు. తర్వాత అధిక ఫీజులతో ప్రభుత్వ ఉన్నత స్కూళ్లల్లోనే అమ్మాయిలను చేర్పిస్తున్నారు.

# ఫుడ్ అండ్ సేఫ్టీ బృందాల విస్తృత తనిఖీలు

-మొదటిపేజీ తరువాయి

కలుపుతున్నట్లు నిర్ధారణ అయింది. అమాయకుల ప్రాణాలతో భారీ మూల్యం చెల్లించాక అధికారులు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ఫుడ్ అండ్ సేఫ్టీ బృందాలు విస్తృతంగా దాడులు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా పాలలో కల్తీని గుర్తించేందుకు మొత్తం 517 పాల నమూనాలను (శాంపిల్స్) సేకరించారు. వీటిలో 28 నమూనాల్లో నాణ్యతా లోపాలు ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. ఒక నమూనాను 'మిస్ బ్రాండ్' (తప్పుడు బ్రాండింగ్)గా అధికారులు గుర్తించారు. ఏకంగా 36 మంది వ్యాపారులు కనీస లైసెన్సులు లేకుండానే పాల దందా చేస్తున్నట్లు తేల్చారు. సేకరించిన నమూనాలను తదుపరి పరీక్షల కోసం కాకినాడ, హైదరాబాద్, చెన్నై నగరాల్లోని అత్యున్నత ప్రయోగశాలలకు (ల్యాబ్స్) పంపారు. ల్యాబ్ ఫలితాలు వచ్చిన వెంటనే జాయింట్ కలెక్టర్ (జేసీ) సమక్షంలో విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు.



**పాలలో యూరియా, సర్ఫ్!**

కల్తీ ఘటన జరిగిన రాజమహేంద్రవరం ఉన్న తూర్పుగోదావరి జిల్లాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడే అత్యధికంగా నమూనాలు సేకరించారు. ఈ జిల్లాలో వరుస తనిఖీలు చేసి ఏకంగా 705 నమూనాలను సేకరించారు. వీటిలో 15 నమూనాల్లో ప్రాణాంతక లోపాలు బయటపడ్డాయి. ఒక శాంపిల్లో ఏకంగా 'యూరియా' కలిపినట్లు నిర్ధారణ అయింది. ఎనిమిది నమూనాల్లో బట్టలు ఉతికే 'డిటర్జెంట్' ఉన్నట్లు తేలింది. ఇవి తాగితే పేగులు దెబ్బతినే ప్రమాదం ఉంది. రెండు నమూనాల్లో 'మాల్టోడెక్స్ట్రిన్' అనే ప్రమాదకర రసాయనాన్ని కలిపారు. మరో ఐదు నమూనాల్లో పాలు చిక్కగా కనిపించేందుకు భారీగా నీరు కలిపినట్లు గుర్తించారు.

**జిల్లాల వారీగా కల్తీ బాగోతం**

కల్తీ మాఫియా రాష్ట్రమంతా విస్తరించినట్లు ఈ తనిఖీల్లో స్పష్టమైంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా కల్తీ జరుగుతోంది. అనంతపురం జిల్లాలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఒకే చోట 100 లీటర్ల నాణ్యత లేని పాలను పట్టుకున్నారు. వాటిని వెంటనే సీజ్ చేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా 32 చోట్ల తనిఖీలు నిర్వహించారు. మచిలీపట్నంలో 20 లీటర్ల నాణ్యత లేని బాదం పాలను గుర్తించారు. అలాగే నీరు కలిపిన పాలలో ఫ్యాట్ (కొవ్వు) శాతాన్ని తనిఖీ చేశారు. కనీసం 5% ఉండాల్సిన ఫ్యాట్ కేవలం 3.5% మాత్రమే ఉన్నట్లు తేల్చారు. కాకినాడ జిల్లాలో 12 ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. 10 నమూనాలు సేకరించారు. ఒక చోట పాలలో నాసిరకం పాలపొడి కలిపినట్లు గుర్తించారు. వెంటనే 5 కేజీల నాసిరకం పాలపొడిని సీజ్ చేసి వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. చిత్తూరు జిల్లాలోనూ కల్తీ రాయుళ్లు రెచ్చిపోయారు. 37 నమూనాలను సేకరించారు. ఏడింటిలో నాణ్యత లోపం ఉన్నట్లు తేలింది. పాలకోవాలో 'మైదా పిండి' కలుపుతున్నారని బయటపడింది. పాలలో కూడా నాసిరకం పాలపొడి కలుపుతున్నారని నిర్ధారించారు. గుంటూరు జిల్లాలో 21 నమూనాలను సేకరించారు. నాలుగింటిలో వెన్న శాతం దారుణంగా పడిపోయినట్లు గుర్తించారు. మిగిలిన ఫలితాలు రావాల్సి ఉంది. ఉత్తరాంధ్రలోనూ తనిఖీలు సాగాయి. విశాఖపట్నంలో 38 నమూనాలు, శ్రీకాకుళంలో 15 నమూనాలను సేకరించారు. ఈ నమూనాల ప్రయోగశాల ఫలితాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

# చెరుకూరులో పనికిరాని రోడ్లు.... లక్షల నిధులు వృథా

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

చెరుకూరు పంచాయతీలో అభివృద్ధి పనుల పేరుతో సిమెంట్ రోడ్లు, కంకర రోడ్లు నిర్మించామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే గ్రామంలో పరిస్థితులు గమనిస్తే ఈ రోడ్లు ప్రజలకు అవసరమైన మార్గాల్లో కాకుండా ఉపయోగం లేని ప్రదేశాల్లో నిర్మించబడ్డాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఫలితంగా లక్షల రూపాయలు ఖర్చయినా గ్రామ ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోయిందని వారు చెబుతున్నారు. గ్రామంలో ఉన్న ఒక ప్రధాన రహదారి ఆర్అండ్బీ శాఖకు చెందినదని స్థానికులు చెబుతున్నారు. అయితే అదే రోడ్డులో ఒక భాగంలో ఐదు అడుగుల వెడల్పుతో సిమెంట్ వేసి దానిని పంచాయతీ నిర్మాణంగా చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని అధికారులు కాలిబాటగా చూపుతున్నప్పటికీ గ్రామస్తుల మాటల్లో ఇది ప్రజలకు ఉపయోగం లేని నిర్మాణంగా మారింది. గ్రామస్తులు ప్రశ్నలు అడిగినప్పుడు ఈ మార్గాన్ని స్మశానానికి వెళ్లే రోడ్డు అని అధికారులు చెప్పినట్లు సమాచారం. అయితే అదే మార్గం ప్రధాన రహదారిలో ఉండటంతో ఈ వివరణపై ప్రజలు అనుమానం వ్యక్తం



చేస్తున్నారు. ఒక ప్రధాన రహదారిలో ఐదు అడుగుల సిమెంట్ వేయడం ద్వారా స్మశాన రోడ్డు నిర్మించామని చెప్పడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ఇక మరో చోట చెరువు గట్టుపై కంకర పోసి రోడ్డు నిర్మించామని అధికారులు చెబుతున్నారు. కానీ గ్రామస్తుల మాటల్లో ఇది కూడా ప్రజలకు ఉపయోగం లేని పని. ఈ మార్గం ఏర్పడిన తర్వాత మందుబాబులు, బహిర్భూమికి వెళ్లేవారి రాకపోకలు పెరిగాయని వారు వాపోతున్నారు. అవసరం లేని చోట్ల నిధులు ఖర్చు చేసి రోడ్లు వేశామని చెప్పుకోవడం వెనుక నిధుల దుర్వినియోగం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై గత 15 రోజులుగా రక్షణ దినపత్రిక వరుస కథనాలు ప్రచురిస్తూ వాస్తవ పరిస్థితులను బయటపెడుతోంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసహనాన్ని కలిగిస్తోంది. జిల్లా కలెక్టర్, రాజకీయ నాయకులు ఈ అంశంపై స్పందించకపోవడం కూడా గ్రామస్తుల ఆగ్రహానికి కారణమైంది. ఈ పరిస్థితి కొనసాగితే పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నిరాహార దీక్షలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ప్రజల డబ్బుతో చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగం లేకపోతే అది అభివృద్ధి కాదని చెరుకూరు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాస్తవాలను వెలికి తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నీటిసంరక్షణ, జలవనరుల పరిరక్షణపై వందరోజుల కార్యాచరణ

-మొదటిపేజీ తరువాయి

ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

**నేటి నుంచి ప్రారంభం:**

ఏపీలోని 60,000 మంది సాగునీటి సంఘాల సభ్యులకు ఈ కార్యక్రమ నిర్వహణ చేపట్టే కీలక బాధ్యతలను సీఎం అప్పగించారు. నీటి భద్రత అంశంలో ప్రజలను భాగస్వాములను చేయాలని దీన్నో ప్రజా ఉద్యమంగా మలచాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు నాలుగు దశల కార్యాచరణను చంద్రబాబు ప్రకటించారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాలని ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఏప్రిల్ 21 నుంచి జూలై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని, జూలై 10 నుంచి 14 జూలై పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం సూచించారు. నీటి పొదుపును కీలకాంశంగా తీసుకుని ప్రతీ నీటి బొట్టనూ ఒడిసిపట్టేలా చూడాలని అన్నారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నీటి భద్రత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని సామూహిక బాధ్యత అని సీఎం వివరించారు.ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, ప్రతి ఎకరాకు నీరందించడం, ప్రతీ రైతుకు భరోసా ఇవ్వటం లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

శాఖల సమన్వయంతో అమలు: వివిధ శాఖల సమన్వయంతో సాగునీటి సంఘాలు, గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో కార్యక్రమం అమలు కావాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ విధానపరమైన అంశాలను పర్యవేక్షించాలని జిల్లా, క్షేత్రస్థాయిలో కలెక్టర్ సహా సర్పంచ్ అధ్యక్షతన పనులు చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలు దీనికి డ్రైవింగ్ ఫోర్సుగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5697 గ్రామాల్లో భూర్భజలాల ఎద్దడి ఉన్నట్టు గుర్తించామని సీఎం చెప్పారు. అన్ని చెరువులూ నింపి భూగర్భ జల మట్టాన్ని కనీసం 1.5 మీటర్ల మేర పెంచటం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. నీటిని నిల్వ చేయాలి. పొదుపు చేయాలి. మైక్రో ఇరిగేషన్ అమలు చేయాలి. అదే విధంగా ప్రతి చుక్కను సమర్ధంగా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**అధికారులకు సీఎం దిశానిర్దేశం:**

ఉపగ్రహ చిత్రాల ఆధారంగా శాస్త్రీయంగా చెరువుల మ్యాపింగ్ చేయటంతో పాటు హైడ్రాలజీ మ్యాప్ ను కూడా విశ్లేషించి అనుసంధాన ప్రక్రియను చేపట్టాలన్నారు. సాగు నీటి సంఘాలు వాటర్ బడ్జెట్ ను తయారు చేయటంతో పాటు వాటర్ ఆడిట్ కూడా చేపట్టాలని ఆదేశించారు. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయాలి. పూడిక తీత పనులు చేపట్టాలని సీఎం చెప్పారు. గుర్రపు డెక్క తొలగించి చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలని సూచించారు. అప్పుడే ఎక్కువ నీటిని సంరక్షించుకోవచ్చు. ముంపును అరికట్టవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అవసరమైన మేరకు చెక్ డ్యాంలను రిపేర్లు చేయాలి. కొత్త స్ట్రక్చర్లు నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు.

భూగర్భ జలాలు మరీ తక్కువగా ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి సూచించారు. అన్నమయ్య జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టు జలధార స్ఫూర్తిగా వాగులు, వంకలు, ఇతర నీటి వనరుల్ని అనుసంధానించాలన్నారు. ఎక్కడికక్కడ జల సంరక్షణా చర్యలు చేపట్టి.. ప్రతీ నీటి చుక్కనూ ఒడిసి పట్టాలని సూచించారు. నీటి భద్రతపై 100 రోజుల కార్యాచరణను అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. గత పాలకులు ఈ సంరక్షణా చర్యల్ని పక్కన పడేశారని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. సాగునీటి సంఘాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఈ వందరోజుల యాక్షన్ ప్లాన్ ను విజయవంతం చేయాలని నిర్దేశించారు.

## మాచర్లలో నవ వధువు హత్య కేసు... సీఐ నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు

**మాచర్ల రక్షణ న్యూస్** పల్నాడు జిల్లా మాచర్లలో నవ వధువు చౌడేశ్వరి హత్య కేసు సంచలనంగా మారింది. ప్రేమ వివాహం చేసుకున్న యువతిని తల్లిదండ్రులకు అప్పగించిన తర్వాత అనుమానాస్పద పరిస్థితుల్లో ఆమె మృతి చెందడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం, కేసు దర్యాప్తులో లోపాలు బయటపడడంతో మాచర్ల సీఐ తురక వెంకటరమణతో పాటు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోం గార్డు రఫీపై సస్పెన్షన్ వేటు పడింది. కేసును ఆత్మహత్యగా మలిచే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మాచర్ల పట్టణంలో చోటుచేసుకున్న చౌడేశ్వరి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంటి నుంచి వెళ్లిపోయి ప్రేమించిన యువకుడు నాగరాజుతో గత మార్చి 13న చౌడేశ్వరి వివాహం చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు పోలీసుల వద్దకు వెళ్లడంతో కుటుంబ వివాదం పరిష్కారం పేరుతో మార్చి 15న చౌడేశ్వరిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సమాచారం. అయితే మూడు రోజులకే, మార్చి 18న చౌడేశ్వరి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో పోలీసుల వ్యవహారశైలి పలు అనుమానాలకు తావిచ్చింది. ముఖ్యంగా ప్రేమ వివాహం చేసుకున్న యువతిని తల్లిదండ్రులకు అప్పగించే ముందు సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం, ఆమె భద్రతపై సరైన దృష్టి పెట్టకపోవడం పై తీవ్ర విమర్శలు వినిపించాయి. అదే విధంగా చౌడేశ్వరి మృతి చెందిన తర్వాత కూడా కేసును సరైన విధంగా నమోదు చేయకుండా ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ప్రాథమిక ఆధారాలు సేకరించడంలో ఆలస్యం చేయడం, సంఘటన స్థలాన్ని పూర్తిగా పరిశీలించకపోవడం, సంబంధిత వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయకపోవడం వంటి అంశాలు పోలీసుల నిర్లక్ష్యంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా ఈ కేసులో చౌడేశ్వరి తల్లిదండ్రుల నుంచి సుమారు రూ.10 లక్షలు తీసుకుని కేసును మళ్లించే ప్రయత్నం చేశారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి మాచర్ల సీఐ వెంకటరమణతో పాటు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోం గార్డు రఫీపై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. మరోవైపు చౌడేశ్వరి తల్లిదండ్రులు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ అధికారికంగా అరెస్ట్ చూపించలేదని సమాచారం. ఘటన జరిగి వారం రోజులు గడిచినా పూర్తి వివరాలు వెలుగులోకి రాకపోవడం పై స్థానికంగా చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా చౌడేశ్వరి భర్త నాగరాజును ఇటీవల పోలీసు అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతను బయటకు రాకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. నాగరాజు బయటకు వచ్చి మాట్లాడితే ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

### వారం రోజుల్లో ఇద్దరు సీఐలపై చర్యలు

పల్నాడు జిల్లాలో వారం వ్యవధిలో ఇద్దరు సీఐలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం గమనార్హం. దాచేపల్లి సీఐ భాస్కర్పై వివాహేతర సంబంధం ఆరోపణల నేపథ్యంలో బదిలీ వేటు పడగా, మాచర్ల సీఐ వెంకటరమణపై పరువు హత్య కేసులో నిర్లక్ష్యం, నగదు వ్యవహారం ఆరోపణలతో సస్పెన్షన్ విధించారు. శాఖ ప్రతిష్ఠ దెబ్బతినే విధంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు.


## కార్పొరేషన్లలో పెరుగుతున్న డివిజన్లు

విశాఖపట్టణం ఏపీలోని పలు కార్పొరేషన్లలో భారీగా వార్డులను పెంచుతూ కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఏపీలో అత్యధిక వార్డులు ఉన్న కార్పొరేషన్ గా మహా విశాఖ నగర పాలక సంస్థ జీవీఎంసీ నిలిచింది. అక్కడ 98 నుంచి ఏకంగా 120 దాకా వార్డులు పెరిగాయి. ఆ తరువాత స్థానంలో విజయవాడ కార్పొరేషన్ ఉండబోతోంది. ఇక్కడ 64 వార్డులు ఉండేవి, వాటిని 86 వార్డులుగా పెంచారు. ఇక మూడవ స్థానంలో గుంటూరు కార్పోరేషన్ ఉంది. ఇక్కడ 57 వార్డులు ఉంటే దానికి 76 వార్డులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఏపీలో ఉన్న 13 కార్పొరేషన్లలో వరస ప్రకారం చూస్తే పెరిగిన వార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులో 54 వార్డులు ఉంటే అవి కాస్తా 72 వార్డులు అవుతున్నాయి. కర్నూల్ కార్పోరేషన్ కి 52 వార్డులు ఉంట్టే 68 వార్డులుగా పెరుగుతున్నాయి.



# డెకాయిట్‌లో రొమాన్స్ సీన్స్ కష్టంగా అనిపించాయి


అడివి శేష్ హీరోగా, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నెల 10న విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ బట్టి చూస్తే..ఇది లవ్‌స్టోరీతో కూడిన యాక్షన్ సినిమా అని అర్థమవుతుంది. ఇందులో హరి పాత్రలో హీరో అడివి శేష్, సరస్వతి పాత్రలో మృణాల్ ఠాకూర్ కనిపించనున్నారు. అయితే మృణాల్ తొలిసారి ఇందులో యాక్షన్ సీన్స్ కూడా చేసింది. అంతేకాదు ఓ పాపకు తల్లిగానూ నటించింది. అయితే ఈ సన్నివేశాలన్నీ ఈజీగానే చేసింది కానీ.. రొమాన్స్ సీన్సే కాస్త ఛాలెంజింగ్‌గా అనిపించాయట. ఈ విషయాన్ని స్వయంగా మృణాలే చెప్పింది. డెకాయిట్ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం మృణాల్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఛాలెంజింగ్‌గా అనిపించిన సన్నివేశాలేంటని ఓ విలేకరి అడగ్గా.. ఈ విధంగా సమాధానం ఇచ్చింది. 'యాక్షన్ సీన్లు నాకు ఇబ్బంది కాలేదు కానీ.. రొమాన్స్ సన్నివేశాలే ఛాలెంజింగ్‌గా అనిపించాయి. ఇదొక డిఫరెంట్ లవ్‌స్టోరీ సినిమా. ఇందులో హీరోపై కోపం ఉన్నప్పటికీ.. పాస్ట్‌లో ప్రేమగా ఉండాలి. రొమాన్స్ చేయాలి. అలా నటించడం నాకు సవాల్‌గా అనిపించింది. సరస్వతి పాత్ర నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది' అన్నారు. ఇక స్టోరీ నచ్చడంతో ఈ సినిమాకు పారితోషికం కూడా తగ్గించుకున్నట్లు మృణాల్ చెప్పుకొచ్చింది.



# 'బైకర్'పై రామ్ చరణ్ ప్రశంసలు .. శర్వానంద్ సినిమాకు మెగా బూస్ట్!

టాలీవుడ్‌లో ఇటీవల విడుదలైన సినిమాల్లో ప్రత్యేక కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం బైకర్. శర్వానంద్ హీరోగా నటించిన ఈ రేసింగ్ బ్యాక్‌డ్రాప్ ఎమోషనల్ డ్రామా మంచి స్పందనను సొంతం చేసుకుంది. దర్శకుడు అభిలాష్ కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ సినిమాపై తాజాగా మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ స్పందించడం హాట్ టాపిక్‌గా మారింది. 'బైకర్' గురించి చాలా మంచి విషయాలు వింటున్నానని, ఇలాంటి అరుదైన కాన్సెప్ట్‌తో సినిమా తీసినందుకు యూవీ క్రియేషన్స్‌కు హ్యాట్సాఫ్ అంటూ చరణ్ ప్రశంసలు కురిపించారు. ఇక ఈ సినిమాలో శర్వానంద్, డా. రాజశేఖర్ నటనకు మంచి స్పందన వస్తుండటం ఆనందంగా ఉందని చరణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా తండ్రి--కొడుకు భావోద్వేగాలను హైలైట్ చేస్తూ వచ్చిన సన్నివేశాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు అభిలాష్ కృష్ణ ఇలాంటి యూనిక్ కాన్సెప్ట్‌ను ఎంచుకుని తెరకెక్కించడం గొప్ప విషయమని రామ్ చరణ్ అభినందించారు. ప్రస్తుతం కమర్షియల్ ఫార్ములా సినిమాల మధ్య ఇలాంటి కొత్త ప్రయత్నాలు రావడం ఇండస్ట్రీకి మంచి సూచిక అని ఆయన అభిప్రాయపడ్డారు. రామ్ చరణ్ వంటి స్టార్ హీరో నుంచి వచ్చిన ఈ ప్రశంసలు 'బైకర్' సినిమాకు మరింత హైప్ తీసుకువచ్చాయి. ఇప్పటికే పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో రన్ అవుతున్న ఈ చిత్రం, ఇప్పుడు మరింత ప్రేక్షకులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. బైకర్ పై రామ్ చరణ్ చేసిన కామెంట్స్ సినిమా యూనిట్‌కు పెద్ద బూస్ట్‌గా మారాయి. శర్వానంద్ కెరీర్‌లో మరో సక్సెస్‌గా ఈ చిత్రం నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీ ఏప్రిల్ 30న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కి మంచి టాక్ వచ్చింది. పెద్ది కూడా బాక్సాఫీస్‌ని షేక్ చేయనుందని అంటున్నారు.


# కొత్త అనుభూతిని పంచేలా 'డైమండ్ డెకాయిట్'



పార్థ గోపాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'డైమండ్ డెకాయిట్'. సూర్య జి. యాదవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మేఘన హీరోయిన్. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది.. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వాకాడ అప్పారావు, నిర్మాత శిరీష్ రెడ్డి, నటుడు శివాజీ రాజా పాల్గొని, 'డైమండ్ డెకాయిట్' విజయం సాధించాలని ఆకాంక్షించారు. పార్థ గోపాల్ మాట్లాడుతూ-- "సస్పెన్స్, ఎమోషన్స్, థ్రిల్... ఇలా అన్నీ కలిసిన పూర్తి ఎంటర్‌టైనర్ 'డైమండ్ డెకాయిట్'. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది" అని తెలిపారు. "వైవిధ్యమైన కథాంశంతో మా సినిమా తీశాం. థియేటర్‌లో వీక్షించి, యూనిట్‌ని సపోర్ట్ చేయాలి" అని సూర్య జి. యాదవ్ పేర్కొన్నారు.

# సోనాక్షి ప్రెగ్నెన్సీ రూమర్స్‌పై పూనమ్ సిన్హా క్లారిటీ.. నన్ను ఎన్నిసార్లు నానమ్మను చేశారో లెక్కే లేదు..





బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనాక్షి సిన్హా, ఆమె భర్త జహీర్ ఇక్బాల్ వైవాహిక జీవితంపై సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గత కొంతకాలంగా సోనాక్షి గర్భవతి అనే వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ రూమర్స్‌పై సోనాక్షి తల్లి పూనమ్ సిన్హా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఒక ప్రైవేట్ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన పూనమ్ సిన్హా, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై హాస్యాస్పదంగా స్పందించారు. "సోషల్ మీడియా వల్ల నన్ను ఇప్పటికే ఎన్నిసార్లు నానమ్మను చేసేశారో లెక్కే లేదు!" అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఆ సంతోషకరమైన రోజు నిజంగా వచ్చినప్పుడు అందరికీ తెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సోనాక్షి జననం గురించి గుర్తుచేసుకున్న పూనమ్, మా ఇంట్లోకి ఆడపిల్ల అడుగుపెట్టిన రోజు మా జీవితంలోనే గొప్ప రోజు. ఆడపిల్లలు లేని జీవితం అసంపూర్ణంగా ఉంటుంది. ప్రతి ఇంట్లోనూ ఒక ఆడపిల్ల ఉండటం ఎంతో ప్రత్యేకం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో సోనాక్షి ఎరుపు దుస్తుల్లో కనిపించగా, ఆమె చేతిని పొట్టపై ఉంచుకున్న తీరు చూసి నెటిజన్లు గర్భవతి అని ఊహాగానాలు మొదలుపెట్టారు. దీంతో సోషల్ మీడియాలో మరోసారి ప్రెగ్నెన్సీ రూమర్స్ వైరల్ అయ్యాయి. ఈ తరహా పుకార్లపై గతంలోనే సోనాక్షి సిన్హా తనదైన శైలిలో స్పందించారు. "కేవలం చేతిని పొట్టపై పెట్టుకున్నందుకు నన్ను గర్భవతిని చేసేశారు. మానవ చరిత్రలోనే 16 నెలలు గర్భంతో ఉన్న వ్యక్తిగా నాకు రికార్డు ఇచ్చేశారు" అంటూ సరదాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అటు జహీర్ ఇక్బాల్ కూడా ఒక వేడుకలో సోనాక్షి పొట్టపై చేయి వేసి "జాగ్రత్త" అంటూ సరదాగా స్పందించడం అప్పట్లో వైరల్ అయింది. సోనాక్షి, జహీర్ ప్రేమకథ కూడా ఆసక్తికరమే. 2013లో సల్మాన్ ఖాన్ ఇచ్చిన పార్టీలో తొలిసారి కలుసుకున్న వీరు, దాదాపు ఏడేళ్ల పాటు ప్రేమలో ఉన్నారు. చివరకు 2024లో ముంబైలో సన్నిహితుల సమక్షంలో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. అనంతరం సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించారు.



# కింగ్ ఖాన్ హాలీవుడ్ ఎంట్రీ? 'ది వైట్ లోటస్' వెబ్ సిరీస్‌లో షారూఖ్.!

ప్రముఖ హాలీవుడ్ వెబ్ సిరీస్ 'ది వైట్ లోటస్' మూడో సీజన్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ ఈ క్రేజీ సిరీస్‌లో నటించబోతున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. హెచ్‌బీఓ ఛానెల్‌లో అత్యంత పాపులర్ అయిన డార్క్ కామెడీ డ్రామా సిరీస్ 'ది వైట్ లోటస్'. దీని మూడో సీజన్ చిత్రీకరణ థాయ్‌లాండ్‌లో జరుగుతోంది. అయితే, ఈ సిరీస్ నుంచి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోనే తప్పుకుందనే వార్తలు వచ్చిన కొద్ది రోజులకే.. ఆ స్థానంలోకి షారూఖ్ ఖాన్ రాబోతున్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. షారూఖ్ ఖాన్ ప్రస్తుతం తన సొంత భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడని. హాలీవుడ్ షోలలో నటించే ఆలోచన ఆయనకు ప్రస్తుతానికి లేదని వెల్లడించినట్లు తెలుస్తుంది. మరోవైపు 'ది వైట్ లోటస్' టీమ్ గానీ, షారూఖ్ మేనేజ్‌మెంట్ గానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

Printed and Published by G. Narendra, Editor,1-4-55, Bapatla, Bapatla District.Phone: 8185 997507...